క్లుప్తంగా

చలువ పందిళ్ల ఏర్పాటు



పెన్నహోబిలంలో
చలువ పందిళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 10న జరిగే రథోత్సవానికి భారీగా తరలివచ్చే భక్తుల కోసం ఈఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉత్తర ద్వారం నుంచి ఆలయ ఆవరణ మొత్తం చలువ పందిళ్లు అమర్చారు. ఈఓ మాట్లాడుతూ జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక నుంచి వచ్చే భక్తులు ఎండ వేడిమి నుంచి రక్షణ పొందడానికి చలువ పందిళ్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే బ్రహ్మోత్సవాల కోసం ప్రత్యేకంగా కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి వసతి కల్పించామన్నారు. భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

టెట్రా ప్యాకెట్ల స్వాధీనం

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామంలో బెస్త లక్ష్మణ అనే వ్యక్తి ఇంట్లో కర్ణాటకకు చెందిన 40 టెట్రా మద్యం ప్యాకెట్లు ఆదివారం స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సునీత తెలిపారు. అతడిని కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

సువార్త సభలను విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న పాస్టర్, సంఘ పెద్దలు

కంబదూరు: మండల కేంద్రంలోని సీఅండ్‌ఐజీ మిషన్ చర్చిలో ఈనెల 23, 24, 25వ తేదీల్లో నిర్వహించే రక్షణ సువార్త ఉజ్జీవ సభలను విజయవంతం చేయాలని పాస్టర్ జేమ్స్, సంఘ పెద్దలు ప్రభాకర్, జోషఫ్‌రెడ్డి, విల్సన్, జయరాజు, కుమార్ సూచించారు. ఆదివారం సభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. రోజూ సాయంత్రం 6 గంటలకు జరిగే సభలకు ముఖ్య ప్రసంగీకులుగా రెవరెండ్ రాంబాబు, పాస్టర్ సువర్ణరాజు, పాస్టర్ ఎజ్రా హాజరవుతారన్నారు.నియోజకవర్గంలోని క్రైస్తవులందరూ ఈ సభలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పెద్దలు జాన్‌శాస్త్రి, జకరయ్య, మెహోషువ, రాళ్లపల్లి తిమోతి, యోనవస్తుడు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఖత్నా శిబిరానికి స్పందన



పిల్లలకు పౌష్టికాహార కిట్లు అందిస్తున్న చారిటబుల్ సొసైటీ నిర్వాహకులు

ఉరవకొండ: స్థానిక హజరత్ సయ్యద్‌షా జమాలుద్దీన్ ఖాదరి దర్గా ఆవరణలో అమీన్ మిలాదున్నిబి చారిటబుల్ సొసైటీ, జామియా తాసీరియా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో సయ్యద్‌షా అజ్మతుల్లా ఆశీస్సులతో ఉచిత ఖత్నా(వడుగులు) క్యాంపు ఆదివారం నిర్వహించారు. ఖత్నా చేయించుకున్న పేద ముస్లిం పిల్లలకు సొసైటీ ఆధ్వర్యంలో అజ్మతుల్లా హుసేనీ, తాసీర్‌బాబా, తఖీబాబా, తయ్యబ్ హఫీజ్‌సాబ్‌ల చేతుల మీదుగా పౌష్టికాహార కిట్లతో పాటు పాలు, బ్రెడ్డు అందించారు. వైద్యాధికారులు డాక్టర్ నిజాం, డాక్టర్ బాషా ఆధ్వర్యంలో ఉచితంగా రక్త పరీక్షలను నవాజ్ ల్యాబ్ నిర్వాహకుడు బళ్లారి రహంతుల్లా నిర్వహించారు. పిల్లలకు ఉచితంగా మందులను ఆలీ, నూరానీ మెడికల్స్ నిర్వాహకులు అందించారు.

గోల్డ్ సిల్వర్ అండ్ డైమండ్స్ మర్చంట్స్ అసోసియేషన్‌లో చోటు



రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న జయం విశ్వనాథ్ (వృత్తంలో)

కళ్యాణదుర్గం: ఏపీ బులియన్ గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్స్ మర్చంట్ అసోసియేషన్‌లో కళ్యాణదుర్గానికి చెందిన పలువురు వ్యాపారులకు చోటు లభించింది. ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఒంగోలులో నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గానికి చెందిన జయం విశ్వనాథ్‌ను రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, ఈసీ మెంబర్లుగా ఏఎస్ నబీరసూల్, జె అమర్‌నాథ్‌ను కమిటీ ఎన్నుకుంది. కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన వారికి రాష్ట్ర కమిటీలో చోటు లభించడంతో బంగారు వ్యాపారస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పొలంబడి .. సాగులో నూతన ఒరవడి!

- సత్ఫలితానిస్తున్న కార్యక్రమం
- రైతు సంక్షేమం కోసం సీఎం జగన్ కృషి
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



పొలంబడి కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయదుర్గం: వ్యవసాయం రైతుకు జీవనాధారం. ఆరుగాలం శ్రమించి అధిక దిగుబడులు ఆశించినా.. పెరిగిన పెట్టుబడితో నష్టాలు తప్పడం లేదు. ఇందుకు కారణం సస్యరక్షణ, పురుగు మందులు, ఎరువుల వినియోగంపై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడమే. సాగులో ఎదురవుతున్న ఇబ్బందులపై అవగాహన కల్పించి, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'పొలంబడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తద్వారా అన్నదాతలకు క్షేత్రస్థాయిలోనే ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా కార్యరూపం దాల్చారు. దీంతో సత్ఫలినిచ్చేలా అధికారులు కృషి చేస్తున్నారు. రైతులు అవగాహన లోపంతో పంట ఉత్పత్తులు రాబట్టేందు కోసం రైతులు క్రిమి సంహారక మందులు, మోతాదుకు మించి ఎరువులను వినియోగిస్తున్నారు. ఈ కారణంగా ఆహార ఉత్పత్తులు విషతుల్యంగా మారుతున్నాయి. విత్తు నుంచి కోత దాక రైతుల ఆలోచనలను సేంద్రియ ఎరువుల వైపు మళ్లించి మేలు రకమైన ఉత్పత్తులు సాధించడమే పొలంబడి లక్ష్యం.

ప్రతిష్టాత్మకంగా 'పొలంబడి'

పొలంబడి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. నాట్లు వేసిన 40 రోజుల వరకు ఏ విధమైన పురుగు మందులు వాడనవసరం లేదని చెప్పడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 40 రోజుల వరకు మొక్క ఆరోగ్యంగా అన్ని తెగుళ్లను తట్టుకోగలదు. పొలంబడి శిక్షణకు ఎంపిక చేసిన గ్రామాల్లో 25 ఎకరాలు తీసుకుని, అందులో 30 మంది రైతులను గ్రూపుగా ఏర్పాటు చేసి 14 వారాల పాటు శిక్షణకు కార్యాచరణ చేపడుతున్నారు. వారినికో అంశంపై రైతులకు అవగాహన కల్పిస్తారు. విత్తన శుద్ధి నుంచి కోతల వరకూ అన్ని పంటల్లో చేపట్టాల్సిన శాస్త్రీయ పద్ధతిలో అవగాహన కల్పిస్తున్నారు. పొలాల్లోనే మిత్ర, శత్రు పురుగల వల్ల కలిగే లాభాలు, నష్టాలపై రైతులకు వివరిస్తూ, వాటికి వియోగించాల్సిన మోతాదుపై అవగాహన కల్పిస్తూ చైతన్యం తీసుకువస్తున్నారు. పొలంబడికి ఎంపిక చేసిన 25 ఎకరాల్లో ప్రత్యేకంగా 2 ఎకరాల విస్తీర్ణంలో ఒక ఎకరంలో ప్రయోగాత్మకంగా, అర ఎకరంలో ఐసీఎం (ఇంటిగ్రేటెడ్ క్రాప్ మేనేజ్‌మెంట్) పద్ధతిలో, అర ఎకరంలో రైతులు తాము అనుసరించే సాధారణ విధానంలో సాగు చేస్తున్నారు. పంట కోతలు అయిన తర్వాత ఈ రెండు ఎకరాల్లో మూడు విధానాల్లో సాగు చేసిన వాటిలో ఉత్పత్తులు ఏ స్థాయిలో వచ్చాయో రైతులకు వివరిస్తారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలో రబీలో 71,186 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయి. వీటి పరిధిలోని 240 ఆర్‌బీకేలు ఉండగా, 231 గ్రామాల్లో పొలంబడి, సాగుబడి కార్యక్రమాలు చేపట్టి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

పొలం బడి వివరాలు ఇలా..

నియోజకవర్గం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	ఆర్‌బీకేలు	ఎంపిక చేసిన గ్రామాలు
రాయదుర్గం	22,419	79	73
కళ్యాణదుర్గం	11,270	75	72
ఉరవకొండ	37,497	86	86

ఖర్చులు తగ్గాయి



రైతులు ఒకరిని చూసి మరొకరు అవగాహన లోపంతో ఇష్టారాజ్యంగా ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తుండేవారు. పొలంబడి తర్వాత అవసరానికి తగ్గట్టుగానే వినియోగించాలనే అవగాహన రైతుల్లో ఏర్పడింది. ఫలితంగా పెట్టుబడులు తగ్గి దిగుబడులు కూడా పెరిగాయి.

– జి.శ్రీరామ్, రైతు, గోనేహాళ్

సస్యరక్షణపై అవగాహన



పొలం బడి కార్యక్రమం ద్వారా సస్యరక్షణ పై అధికారులు విస్తతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. రైతు సంక్షేమం దృష్ట్యా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ గొప్ప కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు చేపట్టారు. దీంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది.

– బోయ ఎర్రిస్వామి, రైతు, రంగచేడు

సత్ఫలితాన్నిస్తోంది



పొలంబడి ద్వారా క్షేత్రస్థాయిలో ఇచ్చే శిక్షణ కార్యక్రమాలు సత్ఫలితానిస్తున్నాయి. శిక్షణ పొందిన ప్రతి రైతూ మోతాదుకు మించకుండా ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తూ ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధిస్తున్నారు.

– చంద్రానాయక్, జేడీఏ, అనంతపురం

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కంబదూరు: మండలంలోని కంబదూరు సచివాలయం–2 పరిధిలో సోమవారం ఉదయం ఆరు గంటలకు, వైసీపల్లిలో సాయంత్రం 4 గంటలకు మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

శుభకార్యం

కళ్యాణదుర్గం: మండలంలోని దాసంపల్లిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు గౌని రామాంజనరెడ్డి కుమారుడు రాఘవేంద్రరెడ్డి– సంగీత వివాహానికి మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే 2వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తలారి చంద్రమ్మ, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ తిరుమల వెంకటేశులు ఇంట్లో శుభకార్యానికి మంత్రి హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, కౌన్సిలర్ గోపారం హేమావతి, సర్పంచు హనుమంతప్ప, హనుమంతరెడ్డి, జైపాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోరీల మరమ్మతులు

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల, కెంచంపల్లి గ్రామాల్లో శనివారం కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రోడ్లపై ఉన్న మోరీలు నీటి ప్రవాహంలో కొట్టుకు పోయాయి. స్పందించిన వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, సర్పంచ్ గంగాధర తదితరులు స్పందించి సొంత ఖర్చులతో కొట్టుకుపోయిన మోరీలను యుద్ధప్రాదిపతికన మరమ్మత్తులు చేయించి వాహన రాకపోకలకు అంతరాయక కలగకుండా చర్యలు చేపట్టారు. కొలిమిపాళ్యం – సాసులకుంట, కెంచంపల్లి –కలిగొలిమి గ్రామాల మధ్య ఉన్న మోరీలకు వారు మరమ్మతులు చేయించారు.

'జగనన్నకు చెబుదాం' విజయవంతం చేద్దాం

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అధికారులంతా కృషి చేయాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సూచించారు. ఆదివారం 'సాక్షి' తో ఆయన మాట్లాడారు.. స్పందన కార్యక్రమం కంటే మరింత మెరుగ్గా, సమర్థవంతంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని గుర్తుచేశారు. ఈ నెల 9న లాంఛనంగా ప్రారంభం కాబోతుందని ఆయన వివరించారు. ప్రజల సమస్యలకు సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందుకు అధికారులంతా సన్నద్ధమయ్యేలా కార్యచరణ చేపట్టాలన్నారు. స్పందన తరహాలాగే రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, పోలీస్, ఆరోగ్య– కుటుంబ సంక్షేమ శాఖల నుంచి అధికంగా వినతులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్ట్ మానిటరింగ్ విభాగాలు కూడా ఏర్పాటు కాబోతున్నాయన్నారు. అవినీతికి సంబంధించిన వ్యవహారాలపై ప్రభుత్వం ఇకమీదట సీరియస్‌గా ఉండబోతుందని హెచ్చరించారు.

సుప్రీంకోర్టు తీర్పుతో చంద్రబాబు గుండెల్లో వణుకు..

టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హయాంలో జరిగిన అక్రమాలపై సిట్ విచారణకు లైన్‌క్లియర్ చేస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పును వెలువరించడంతో చంద్రబాబు గుండెల్లో వణుకు మొదలైందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. అమరావతి భూకుంభకోణంతో పాటు ఇతర అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సిట్ విధిస్తే.. తన బండారం ఎక్కడ బయటపడిపోతుందోనని కలవరపాటుకు గురైన చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించి స్టే ద్వారా ఇన్నాళ్లూ అడ్డుకున్నాడన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో పాపం పండబోతోందన్నారు. బాబు, ఆయన పచ్చబ్యాచ్ విచారణ నుంచి తప్పించుకోలేరన్నారు. చంద్రబాబు, పప్పును ప్రజలెవ్వరు నమ్మబోరన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాల్లోనూ విజయం సాధించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు.

పేదల సంక్షేమానికే నవరత్నాలు



వృద్ధులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: పేదల అభివృద్ధికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను ప్రవేశ పెట్టారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. మండలంలోని మల్లికార్జునపల్లి, హులికల్లు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన మంత్రికి స్థానిక నాయకులు, గ్రామస్తులు గజ మాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం ద్వారా కుటుంబానికి అందిన లబ్ధిపై ఆరా తీశారు. సీఎం జగన్ కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని గుర్తు చేశారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ప్రజలు అండగా నిలవాలని మంత్రి కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సచివాలయ సిబ్బంది నమోదు చేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలతో ఎక్కడైనా పథకాలు అందకపోతే వెంటనే వాటిని పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి మంత్రి సూచించారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ ఆంజనేయులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రామచంద్ర, ఎంపీటీసీ హనుమంతరెడ్డి, నాయకులు నరేంద్రరెడ్డి, బ్రహ్మయ్య, మల్లికార్జున, తిమ్మరాజు, దొణతిమ్మప్ప, బూదెప్ప, సురేష్, జగన్ చిత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

బెళుగుప్ప: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఉరవకొండ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. ఆదివారం బెళుగుప్పలో బెళగల్లేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమరావతిలో కేవలం ధనవంతులు మాత్రమే అభివృద్ధి చెందుతారని, అదే వైజాగ్‌ను రాజధాని చేస్తే అన్ని వర్గాలను అభివృద్ధి చేసినవారవుతామన్నారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు తన ప్రసంగాల్లోనే సైకిల్ పోవాలంటున్నాడని, ఆయన తనయుడు లోకేష్‌బాబు తన పాదయాత్రలో 2019 ఎన్నికలు ఫలితాలు పునరావృతం అవుతాయ ఉపన్యాసాలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మరో 20 ఏళ్ల పాటు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారన్నారు. రాష్ట్రానికి ఆర్థిక వనరులు పెంచడానికి హార్బర్స్, పోర్టుల అభివృద్ధి చేస్తున్నారన్నారు. బెళుగుప్ప మండలాభివృద్ధికి సంబంధించి బూదిగుమ్మ వద్ద పెన్నానదిపై సుమారు రూ.52 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణం, జీడిపల్లి పునరావాస నిధులు విడుదల, ఎమ్మిగనూరు నుంచి ఉరవకొండ, కళ్యాణదుర్గం మీదుగా పావగడ వరకూ నేషనల్ హైవేలను కలుపుతూ జాతీయ రహదారి నిర్మించాలన్న అంశాలను ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించారన్నారు. ఉరవకొండ, బెళుగుప్ప, కళ్యాణదుర్గం వరకూ రైల్వే లైను ఏర్పాటుకు సర్వేల రిపోర్టులను కేంద్ర రైల్వేశాఖకు తీసుకెళ్లి అనుమతులకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బెళుగుప్ప సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రమణయాదవ్, నాయకులు మోహన్, వెంకటేశులు, పరమేశ్వర్, రాజు, రఫీ, అంజినరెడ్డి, గాంగ్యా నాయక్, బసవరాజస్వామి తదితరులు పాల్గొన్నారు.

13న రాష్ట్ర స్థాయి భజన పోటీలు

గార్లదిన్నె: మండలంలోని ముకుందాపురంలో ఈనెల 13న హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం(12వ తేదీ) రాత్రి ఆంజనేయ స్వామి భజన మండలి, గ్రామపెద్దల సమక్షంలో తాళాల భజన పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలతోపాటు మరో 18 బృందాలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు.

సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియాలో ఆస్పత్రిలో కార్మికులు, వైద్య సిబ్బందిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న ఆఫీస్ సూపరింటెండెంట్ రాంప్రసాద్‌ను తక్షణం సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆదివారం ఆస్పత్రి గేటు ఎదుట గంటపాటు ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ఆఫీస్ సూపరింటెండెంట్ తీరుతో కార్మికులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం ఆస్పత్రి వైద్యాధికారికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మధు, శంకర్, తిమ్మరాజు, అంజి, మహేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ చేయండి

కుందుర్పి: ఖరీఫ్ ప్రారంభమైన నేపథ్యంలో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని ఏడీఏ యల్లప్పకు ఆదివారం మండలంలోని పలువురు రైతులు వినతి పత్రం అందజేశారు. డివిజన్ వ్యాప్తంగా ఇప్పటికే 1200 ఎకరాల్లో బోరుబావుల కింద వేరుశనగ పంట సాగు చేశామన్నారు. రెండేళ్లుగా బోరుబావుల్లో సమృద్ధిగా నీరు అందుబాటులో ఉండడంతో వేరుశనగ సాగు మరింత పెరిగే అవకాశం ఉందని, సత్వరం విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని రైతులు కోరారు. ఏడీఏకు వినతి పత్రం అందించిన వారిలో రైతు సంఘం నాయకులు హనుమంతప్ప, ఈరన్న, మధు, రాము,పెద్దరాజు తదితరులు ఉన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు వరం




సమ్మర్ క్యాంప్ పోస్టర్లు విడుదల చేస్తున్న ఎల్‌ఎం ఉమాదేవి తదితరులు

కళ్యాణదుర్గం: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు వరంగా మారనున్నట్లు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి అన్నారు. కళ్యాణదుర్గంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్‌ఎం మోహన్‌రెడ్డితో కలిసి సమ్మర్ క్యాంప్ పోస్టర్లు, కరపత్రాలను ఆమె ఆవిష్కరించి, మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాలలో ఈ నెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేలా విభిన్న అంశాలపై విజ్ఞాన కార్యక్రమాలను రూపొందించి 35 రోజుల పాటు అమలు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. వేసవిలో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదన్న ముఖ్య ఉద్దేశ్యంతో చేపట్టిన సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకునేలా విద్యార్థుల తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఉమ, రజనితో పాటు పాఠకులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలకేంద్రంలోని గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు గ్రంథాలయ శాఖ అధికారి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మర్ క్యాంప్‌ను మండలంలోని 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కణేకల్లు: వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకే గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి టి.వన్నూరుస్వామి తెలిపారు. ఈనెల 8 నుంచి వచ్చే జూన్ 11 వరకు 35 రోజుల పాటు ఈ క్యాంపు ఉంటుందన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు



కెంచంపల్లి సమీపంలో
చెక్‌డ్యాము నిర్మిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల పంచాయతీ పరిధిలోని కెంచంపల్లి, కొలిమిపాళ్యం, కలిగొలిమి తదితర గ్రామాల్లో ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ పర్యవేక్షణలో అభివృద్ధి పనులు పక్షం రోజులుగా జోరుగా సాగుతున్నాయి. రూ.12 కోట్ల వ్యయంతో నీటి కుంటలు, చెక్‌డ్యాంలు, పండ్లతోటల పెంపకం, భూ అభివృద్ధి పనులు, పాడిపరిశ్రమ తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆ సంస్థ టెక్నికల్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, ఎస్టీఓ రామాంజనేయులు తెలిపారు. మరో రెండు నెలల్లో ఆయా గ్రామాల్లో కేటాయించిన పనులన్నీ ఆయా గ్రామాల ప్రజలు, రైతుల సహకారంతో పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే 10 చోట్ల చెక్‌డ్యాంలు, నీటి కాలువలు నిర్మాణం పనులు పూర్తి చేశామన్నారు.

హనుమద్ వాహనంపై వేంకటరమణుడు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవారు భక్తులకు హనుమద్ వాహనంపై దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీవారి హనుమద్ వాహనాన్ని ఊరేగించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఆలయ పాలక కమిటీ అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, ఈఓ నరసింహారెడ్డి పాల్గొన్నారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు ప్రసన్న వేంకటరమణుడి కల్యాణోత్సవం నిర్వహిస్తామని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

శ్రీవారి పెళ్లికి భక్తులంతా అతిథులే!

- నేడు వేంకటరమణుడి కల్యాణోత్సవం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

రాయదుర్గం: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణుడి ఆలయంలో సోమవారం విశిష్ట సాంప్రదాయ పద్ధతులతో జరిగే శ్రీవారి కల్యాణోత్సవానికి భక్తులంతా అతిథితులుగా తరలిరానున్నారు. ఆదివారం పెళ్లికొడుకుగా వేంకటేశ్వరుడు, పెళ్లికూతురుగా అరవ తెగకు చెందిన 14 ఏళ్ల బాలికను ముస్తాబు చేశారు. ఈ కల్యాణ వేడుకలను చూసిన కనులకే భాగ్యం దక్కనుంది. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు. కన్యాదాన స్వగృహం నుంచి పెళ్లికొడుకు ఉండే వేంకటరమణుడి ఆలయం వరకు ఊరేగింపు శోభాయమానం తలపించనుంది. అనంతరం 11:30 గంటలకు జీలకర్ర, బెల్లం పెట్టి సాంప్రదాయ పద్ధతి ప్రకారం కల్యాణం జరిపించనున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

శ్రీవారి కల్యాణోత్సవానికి భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ కమిటీ చైర్మన్ పాలాక్షిరెడ్డి, ఈఓ నరసింహారెడ్డి ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా కావాల్సిన వసతులు సమకూర్చేలా చర్యలు చేపట్టామని వారు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను లోపలికి అనుమతించబోమన్నారు.

హాజరు కానున్న విప్ కాపు దంపతులు

శ్రీవారి కల్యాణోత్సవ వేడుకలను ఏటా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి కాపు భారతి దగ్గరుండి ఘనంగా జరిపిస్తారు. కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కీలక భూమిక పోషిస్తారు. ఏర్పాట్లపై విప్ కాపు అధికారులు, అర్చలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలంతా పెద్ద ఎత్తున భాగస్వామ్యులై విజయవంతం చేయాలని విప్ కాపు పిలుపునిచ్చారు.